ఢిల్లీకి తరలిన కాంగ్రెస్ నాయకులు



ఢిల్లీకి బయలుదేరిన నాయకులు

రెబ్బెన, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం స్థానిక సంస్థల విద్య, ఉద్యోగాలతో రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాలకు రెబ్బెన నుంచి కాంగ్రెస్ నాయకులు బయలుదేరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు లావుడ్యరమేష్, సీనియర్ నాయకులు కేసరి కిషన్‌గౌడ్, సురేందర్, రాజు లింగంపల్లి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

షీ టీం సభ్యుల అవగాహన

కాగజ్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల డాడానగర్‌లో సోమవారం షీటీం సభ్యులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై సునీత మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థినిలు ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే 8712670565 కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి శ్రీత, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు బి.రామాదేవి, స్వప్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ గుర్తింపు హాజరుపై పర్యవేక్షణ

రెబ్బెన, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్షణ ఏఎస్‌వో అధికారి అబీద్ అలీ, మండల అధికారి వెంకటేశ్వర్లు సోమవారం రెబ్బెన కాంప్లెక్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ గుర్తింపు హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు ప్రతీరోజు పరిశీలన చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మేడి చరణ్ దాస్, ఉపాధ్యాయులు సదానందం, రాజనర్సు, బాబు, శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు వరం.. పీఎం కిసాన్ మాన్‌ధన్



- 60 ఏళ్లు దాటిన అన్నదాతలకు పింఛన్ ప్రయోజనం
- 18 నుంచి 40 ఏళ్ల రైతులు అర్హులు
- రూ. 55 ప్రీమియంతో ప్రారంభం

జిల్లాలో సాగు వివరాలు

పంట	ఎకరాలు
పత్తి	3,29,184
కంది	27,178
సోయా	2872
మొక్కజొన్న	4610
పెసర	617
రైతులు	97,363

వాంకిడి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన రైతులకు వరంగా మార నుంది. రైతులు వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయం చేసు కున్న వారు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేం దుకు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ మాన్‌ధన్ యోజనను తీసుకు వచ్చింది. వృద్ధాప్యంలోకి వచ్చాక చాలామంది రైతులకు ఎలాంటి ఆదాయవనరులు ఉం డవు. ఈ నేపథ్యంలో వయస్సు పైబడిన చిన్న, సన్నకారు రైతులకు అండగా ఉండేందుకు కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. పథకం కింద 60 ఏళ్లు నిండాక రైతులకు ప్రతీ నెల మూడు వేల రూపాయల చొప్పున పింఛన్ జీవితకాలం అందు తుంది. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న రైతులు ఈ పథకంలో చేరేందుకు అర్హులు. భూ రికార్డుల్లో తమ పేరు ఉండి రెండు హెక్టార్ల వరకు సాగు చేసేందుకు వీలుగా భూమి ఉన్న వారు ఈ పథకం కింద పేర్లు నమోదు చేసు కోవచ్చు. ఎప్పుడు నమోదు చేసుకున్నా పెన్షన్ 60 ఏళ్లు దాటాకే వస్తుంది. నేషనల్ స్కీం, ఈఎస్ఐ స్కీం, ఈపీఎఫ్‌వో పరిధిలో ఉన్న వారు, ఏదైనా ఇతర చట్టబద్ద సామాజిక భ ద్రతా పథకాల పరి ధిలో ఉన్న వారు, ఉన్నత ఆర్థికస్థితి కలిగిన వారు, ట్యాక్స్ పరిధిలో ఉన్నవారు, ట్యాక్స్ పేయర్స్ ఈ పథకానికి అర్హులు కారు. ఈ పింఛన్ అందేవరకు కొంత ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పథకంలో చేరే వారి వయస్సును బట్టి ప్రీమియం ఉంటుంది. రైతు చెల్లించినంతే ప్రభుత్వం కూడా తన వంతుగా బీమా కంపెనీకి నగదు జమచేస్తుంది.

ప్రీమియం చెల్లింపు ఇలా...

వయస్సు	చెల్లించాల్సింది
18 నుంచి 20	55
21 నుంచి 24	61
25 నుంచి 2	80
30 నుంచి 34	106
25 నుంచి 39	150
40 సంవత్సరాలు	200

● ప్రీమియం వివరాలు...

18 నుంచి 40 ఏళ్ల వయస్సు లోపు రైతులు ఈ పథకానికి అర్హులు. ప్రతి నెలా 55 రూపాయల నుంచి 200 రూపాయల వరక ప్రీమియంను బ్యాంక్ ఖాతా నుంచి చెల్లించాల్సి ఉంటుంది. రైతు చెల్లించిన ప్రీమియం మొత్తానికి కేంద్ర ప్రభుత్వం సమానంగా చెల్లిస్తుంది. రైతు 55 రూపాయలు జమ చేస్తే ప్రతీనెల 110 రూపాయలు జమ అవుతుంది. 20 నుంచి 25 ఏళ్ల వయస్సు గల రైతులు 61 రూపాయలు, 30 ఏళ్ల వారికి 105 రూపాయలు, 35 ఏళ్ల వారికి 150 రూపాయలు, 40 ఏళ్ల వారికి 200 రూపాయలు ఉంటుంది. రైతు మర ణిస్తే భార్య ఈ పథకాన్ని కొనసాగించ వచ్చు. 60 ఏళ్ల తర్వాత రైతు మరణిస్తే భార్యకు 1500 రూపాయల పింఛన్ వస్తుంది. రైతు ఫొటో, నివాస, ధ్రువీక రణపత్రం, సాగుభూమి, ఆదా యం వంటి వివరాలు, పత్రాలను సమర్పిం చాల్సి ఉంటుంది.

● దరఖాస్తు చేసుకోవడం ఇలా....

పీఎం కిసాన్ మాన్‌ధన్ లబ్ధిదారులు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ) పీఎం కిసాన్ సీఎం కేఎంవై పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలి. రైతు మొదట తన ఆధార్ నంబర్ ఎంటర్ చేయాలి. పీఎం కిసాన్ పథకానికి నమోదైన బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులను చెల్లించాలి. ప్రతీ నెల ఆటోమెటిక్‌గా డబ్బులు ఖాతా నుంచి పథకానికి జమ అవుతాయి. నామినీ వివరాలను నమోదు చేయాలి. మాన్ ధన్ దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని రైతు సంతకం చేసి పోర్టల్‌లో అప్లోడ్ చేయాలి. వెంటనే పీఎం కిసాన్ మాన్ ధన్ పింఛన్ కార్డు జనరేట్ అవుతుంది. కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రతీ నెల బ్యాంక్ ఖాతా నుంచి ప్రీమియం డబ్బులు పీఎంకేఎంవై పథకానికి ఆటోమెటిక్‌గా జమ అవుతాయి. పీఎం కిసాన్ మాన్ ధన్ లబ్ధిదారులు కాకుంటే సీఎస్‌సీలో మాన్యూవల్‌గా దరఖాస్తు చేసుకొని పింఛన్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ప్రీమియం డబ్బులను నగదు రూపంలో చెల్లించాలి. ఆ తరువాత బ్యాంక్ ఖాతాను జత చేసుకోవాలి.

అవగాహన కల్పిస్తున్నాము

- గోపికాంత్, మండల వ్యవసాయ అధికారి



పీఎం కిసాన్ మాన్‌ధన్ పథకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాము. రైతు వేదికల్లో జరిగే సమావేశాలతో పాటు వ్యక్తిగతంగానూ పథకం గురించి తెలియజేస్తున్నాము. ఈ పథకం రైతులకు వృద్ధాప్యంలో ఎంతో ఆసరగా నిలుస్తుంది. ఆసక్తి ఉన్న రైతులు మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాల కోసం ఏఈవోలను సంప్రదించాలి.

సంక్షేమ ఉన్నత పాఠశాల తనిఖీ

కౌటాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం మొగడ్‌దగడ్ పాఠశాలను సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ కోట ప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతులను పరిశీలించారు. అనంతరం కూరగాయాలను పరిశీలించి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మహేందర్ రెడ్డి, వార్డెన్ ఆత్రం శ్యాంరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీఎంలో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలి

కాగజ్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎంలో స్థానికులకే ఉద్యోగాలను కల్పించాని కోరుతూ ఎస్పీఎం కంపెనీ ఉద్యోగ కల్పన పోరాట సంఘం కన్వీనర్ పొన్న రమేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్ మధూకర్‌కు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీఎం పునరుద్దరణ ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఏర్పాటు చేయగా, ఇక్కడి వారికి ఏ మాత్రం అవకాశం ఇవ్వటం లేదని పేర్కొన్నారు. స్థానికేతరులకు ఉద్యోగాలిస్తున్నట్లు పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయికృష్ణ, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ నాయకుడు ఎండీ ముజామిలుద్దీన్ తదితరులు ఉన్నారు.

సబ్ కలెక్టరేట్ ఎదుట వృద్ధురాలి ధర్నా



ధర్నా చేస్తున్న వృద్ధురాలు సోంబాయి

కాగజ్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం సోంబాయి అనే వృద్ధురాలు ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు చింతలమానేపల్లి మండలం డబ్బాలో భూమి ఉందని అధికారులు ఇతరులకు మార్పు చేశారని ఆరోపించారు. తాను బతికి ఉండగానే చనిపోయినట్టు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి తనకు తెలియకుండా పట్టా మార్పినట్టు పేర్కొన్నారు. తనకు వెంటనే న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా మాట్లాడుతూ తప్పకుండా న్యాయం చేస్తామని, ఈమెకు చెందిన భూమిపై వెంటనే విచారణ చేపట్టాలని సబ్ కలెక్టర్ సిబ్బందికి సూచించారు. వృద్ధురాలి ధర్నాకు సీఐటీయూ నాయకుడు ముంజం ఆనంద్ కుమార్ మద్దతు పలికారు.

రేవంత్ మోసగాడు.. కేసీఆర్ అసమర్థుడు

- పింఛన్ల పెంపులో ప్రభుత్వం విఫలం - ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



సన్నాహక సదస్సులో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వికలాంగులకు ఆరు వేలు, వృద్ధులు, వితంతువులకు నాలుగు వేల పెన్షన్ పెంచుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి అమలు చేయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద మోసగాడని, ఈ విషయంపై ప్రశ్నించకుండా మౌనంగా ఉన్న ప్రతిపక్ష నాయకుడు కేసీఆర్ అసమర్థుడని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విమర్శించారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన మహాగర్జన సన్నాహక సదస్సులో మంద కృష్ణ పాల్గొని మాట్లాడారు. వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు పింఛన్లు పెంచుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు మాట నెరవేర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రశ్నించడంలో ప్రతిపక్ష నేతగా కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని, గడీలకే పరిమితమయ్యాడని విమర్శించారు. పక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇచ్చిన హామీ ప్రకారం చంద్రబాబు ప్రభుత్వం పింఛన్ పెంపు అమలు చేస్తోందన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయకపోతే సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేదలకు ఇవ్వాల్సిన పింఛన్ సొమ్మును భూములు ఉన్న రైతులకు రుణమాఫీ కింద పంచారన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ పెంచాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని తదితర 20 డిమాండ్లతో ఈనెల 13న హైదరాబాద్‌లో మహాగర్జన సదస్సు నిర్వహిస్తామన్నారు. సదస్సుకు జిల్లాలోని వికలాంగులు, వృద్ధులు, వితంతువులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు సత్యనారాయణ, ఇస్లాం, ఖయ్యూం, కేశవ్‌రావ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు స్వీకరించి.. భరోసా కల్పించి..

- ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన కలెక్టర్
- దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని ఆదేశం





ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే , జనకాపూర్ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కౌటాల మండలం గుడ్లబోరి గ్రామానికి చెందిన సదాశివ్ తనకు 65 సంవత్సరాల వయస్సు ఉన్నందున పింఛన్ మంజూరు చేయాలని కోరారు. రెబ్బెన మండలం తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన రజిత తాము పులికుంట గ్రామ శివారు సాగు చేస్తున్న భూమిలో పత్తి పంటను వేరే వ్యక్తి ధ్వంసం చేశాడని చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు.

ఆసిఫాబాద్ మండలం జన్కాపూర్‌కు చెందిన రాజేశ్వర్ తన పేరిట పట్టా అడ ప్రాజెక్టు నిర్మాణంలో పోయినందున నష్టపరిహారం చెల్లించాలని అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని బజారు వాడికి చెందిన భాగ్యలక్ష్మి, రెబ్బెన మండం గోలేటి గ్రామానికి చెందిన సుగుణ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. వాంకిడి మండలం ఖమానాకు చెందిన రాధా బాయి ఖమానా నుంచి ఖమ్మర్‌గాం వెళ్లే దారిని గ్రామానికి చెందిన వ్యక్తి అక్రమించుకున్నారని సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని దరఖాస్తు చేశారు.

కాగజ్‌నగర్ మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. జైనూరు మండలంలోని ట్రాన్స్‌జెండర్స్ తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైద్య సిబ్బంది గ్రామాలను సందర్శించాలి

వర్షాకాలం అయినందున ప్రజాసంక్షేమంలో భాగంగా వైద్య సిబ్బంది గ్రామాలను, ఆశ్రమ పాఠశాలలను సందర్శించి ప్రజలు, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ వేంకటేష్ ధోత్రే సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రిజిస్ట్రర్లను, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వర పీడితులను గుర్తించి వారికి అవసరమైన వైద్య చికిత్సలు అందించాలన్నారు. ప్రతి మంగళ, శుక్ర వారాల్లో గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. అనంతరం మండలంలోని బూర్గుడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో అహర నాణ్యత, మోను, తరగతి గదులను పరిశీలించారు. ఐదో తరగతి గదిలో విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి పఠన సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులనుంచి అర్జీలు స్వీకరించి వాటిని తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. ప్రజాఫిర్యాదులను నేరుగా స్వీకరిస్తూ ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలి

ఆసిఫాబాద్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి):శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అధికారులకు సూచించారు. జిల్లాలోని ఆసిఫాబాద్ టౌన్ సీఐ బాలాజీ వరప్రసాద్, రెబ్బెన సీఐ సంజీవ్ ఎస్పీని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిని అభినందించి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఆదేశించారు. సమాజంలో పోలీసులపై నమ్మకం పెంచేలా పనిచేయాలని సూచించారు. కమ్యూనిటి పోలీసింగ్, రోడ్డు భద్రత, మహిళా భద్రత, యువతలో మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించే కార్యక్రమాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

ఆసిఫాబాద్ సీఐగా బాలాజీ వరప్రసాద్



ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి బాలాజీ వరప్రసాద్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన బుద్దె రవీందర్ ఇటీవల జరిగిన బదిలీలో ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేశారు. ఆయన స్థానంలో వరంగల్ సీసీఎస్‌లో పని చేస్తున్న పి బాలాజీ వరప్రసాద్ ఆసిఫాబాద్ సీఐగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐ బాలాజీ వరప్రసాద్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రెబ్బెన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్



రెబ్బెన, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన సీఐగా సంజయ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సీఐ బుద్దె స్వామి ఇటీవల బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ సంజయ్ మాట్లాడుతూ శాంతిభద్రతలకు అంతా సహరించాలని కోరారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు.

కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆదివాసి గిరిజనుల సంక్షేమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి జిల్లాను అత్యున్నత స్థానంలో నిలిపినందున జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రేను సోమవారం ఆయన చాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్ రావు, డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు వేర్వేరుగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈనెల 2న హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో సంపూర్ణత అభియాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించినందును గవర్నర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చరణ్, జమీర్, బసవయ్య, తిరుపతి, సాయి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలి



పూర్వ విద్యార్థి , అడిషనల్ కలెక్టర్ రేవయ్యను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల పూర్వ విద్యార్థి, మహరాష్ట్రలోని ఉస్మానాబాద్ అడిషనల్ కలెక్టర్ రేవయ్య సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో పూర్వ విద్యారి రేవయ్యను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రేవయ్య మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో చదివి సివిల్స్‌లో ర్యాంకు సాధించి మహరాష్ట్రలో అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు. శ్రద్ధతో చదివితే లక్ష్యాన్ని చేరుకోవడం కష్టతరం కాదని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ఏకాగ్రతలో వినాలన్నారు. భవిష్యత్తులో ఉన్నతస్థానం చేరుకోవాలంటే విద్యతోనే సాధ్యమవుతుందని వివరించారు. ఎంతో కష్టపడి చదివిస్తున్న తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాల్సిన భాధ్యత పిల్లలపై ఉంటుందని తెలిపారు. ఈ పాఠశాలలో చదివి ఇప్పుడు విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇవ్వడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తనకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు పాధాభివందనాలు చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిన్సిపాల్ యాదగిరి, ఉపాధ్యాయులు మహేష్, రమేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ యువకుడి అరుదైన ఘనత

కాగజ్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌కు చెందిన దివంగత మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ షరీఫ్ కుమారుడు ఇక్బాల్ షరీఫ్ అరుదైన ఘనతను సాధించారు. అమెరికాలో అక్యూపెషనల్ హెల్త్, సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ విభాగంలో సోమవారం మాస్టర్ డిగ్రీని విజయవంతం పూర్తి చేశారు. 26 దేశాల విద్యార్థులతో పోటీపడి 98.5 శాతంతో మూడో ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా తోటి మిత్రులు, కాగజ్‌నగర్ వాసులు, గురువులు ఇక్బాల్ షరీఫ్‌ను అభినందించారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



కాగజ్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాగజ్ నగర్ పట్టణానికి చెంది ఆడెపు కిష్టయ్య(73) అనే వ్యక్తి మతిస్థిమితం లేక కన్పించకుండా పోయినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. రెండ్రోజులనుంచి ఇంటికి రాకపోవటంతో అనుమానం వచ్చి ఎంత వెతికినా దొరకపోవటంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో ప్రముఖ వ్యాపారి మృతి



కుమార్ సహానీ(ఫైల్)

బెల్లంపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారి గులషన్ కుమార్ సహానీ(85) సోమవారం మృతి చెందాడు. సహానీ ఇంటిలో ఉన్న సమయంలో గుండె పోటురావడంతో కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. గుండెపోటుతో అప్పటికే మృతిచెందారని వైద్యులు తెలిపారు. కుమార్ సహానీ వస్త్ర వ్యాపార రంగంలో పట్టణంలో ఎన్నోఏళ్లుగా వ్యాపారం చేస్తున్నాడు.

ఆటల పోటీలతో మానసిక వికాసం

మంచిర్యాలక్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆటలపోటీలతో మానసిక వికాసం పెంపొందుతుందని జిల్లా న్యాయమూర్తి వీరయ్య అన్నారు. మంచిర్యాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలను జిల్లా న్యాయమూర్తి వీరయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆటల పోటీలతో మానసికోల్లాసం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీనివాస్ నాయక్, రామ్మోహన్, నిర్మల, కవిత, న్యాయవాదులు పాల్గొన్నారు.

గెలుపు గుర్రాల కోసం కసరత్తు

- ఆశావహుల కోసం జల్లెడ పడుతున్న ప్రధాన పార్టీల నాయకులు
- మున్సిపల్ ఎన్నికల కోసం అడుగులు



కాగజ్‌నగర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పాలకవర్గం ముగిసి ఇప్పటికీ ఏడాది దాటింది. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఏర్పాట్లు చేస్తుండగా, తొలిదఫాలో ఎంపీటీసీలు, జడ్పీటీసీల ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధం అవుతున్నట్టు సమాచారం. ఇందుకు ఆయా గ్రామపంచాయతీలకు సంబంధించిన ఓటరు జాబితా పూర్తి చేసింది. అలాగే ఓటరు జాబితాలో మార్పులు చేర్పుల ప్రక్రియ పూర్తి చేశారు. రెండో దఫాలో సర్పంచి ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రక్రియ కాగానే మున్సిపాలిటీ ఎన్ని కలకు అడుగులు వేయనున్నారు. ఈ దిశగా ఆయా మున్సిపాలిటీలో వార్డులు ఎన్ని? ఓటర్లు ఎంత మంది? జనాభా ఎంత? అనే అంశాలపై ఉన్నతాధికారులు పూర్తి వివరాలు సేకరిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలకు అడుగులు పడుతుండటంతో ప్రధాన పార్టీల నాయకులు గెలుపు గుర్రాల ఎంపిక కోసం కసరత్తు ప్రారంభించారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్..

కాగజ్‌నగర్ మున్సిపాలిటీని గతంలో బీఆర్ఎస్ పార్టీ గెలుచుకుంది. హస్తగతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సారి కూడా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పలు మార్లు సమావేశాలు కూడా నిర్వహించారు. ఎన్నికలకు అంతా సిద్ధంగా ఉండాలని కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. గతంలో గెలిచిన వార్డుల వివరాలు కూడా సేకరించారు. బరిలో దించితే గెలుస్తారన్న అంశాలపై వాకబు చేశారు. బీఆర్ఎస్ పక్కాగా గెలిచి తీరాలన్న దృఢ సంకల్పంతో అడుగులు వేస్తోంది. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌తో త్వరలో బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో అన్నీతానైన ఎమ్మెల్సీ విఠల్..

కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నీ తానై పార్టీని భుజస్కందాలపై వేసుకొని చక్కదిద్దుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో మున్సిపల్‌లో కూడా పక్కగా గెలిచి తీరాలన్న దృఢ సంకల్పంతో అడుగులు వేస్తున్నారు. పక్కాగా వార్డుల వారీగా లెక్కలు తీస్తున్నారు. ఎవరిని బరిలో ఉంచితే గెలుస్తారన్న సర్వేలు కూడా క్షేత్రస్థాయిలో తీసుకుంటున్నారు. ఈసారి ఎలాగైనా మున్సిపాలిటీలో పక్కాగా గెలు పొందాలనే సంకల్పంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆధ్వర్యంలో బీజేపీ..

అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీచినా సిర్పూరులో బీజేపీకి పట్టం కట్టారు. బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ఆధ్వర్యంలో వార్డుల వారీగా అభ్యర్థుల ఎంపిక కోసం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో ఏఏ వార్డుల్లో ఎంత మందికి ఎన్ని ఓట్లు వచ్చాయి..? ఈ సారి బీజేపీ నుంచి ఎవరిని బరిలో నిలిపితే ఎంత మేర ఓట్లు రావచ్చున్న విశ్లేషణతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. బీజేపీ ఓటింగ్ శాతం ఎక్కడ వచ్చింది? వార్డుల వారీగా లెక్కలు తీస్తున్నారు. తప్పకుండా గెలిచే అభ్యర్థుల కోసం కసరత్తు చేస్తున్నారు.

వ్యక్తిగత ఇమేజ్‌తో కోనేరు కోనప్ప..

సిర్పూరు రాజకీయాల్లో దిశానిర్దేశం చేసిన సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన వ్యక్తిగత ఇమేజీతో అడుగుపెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి బరిలో దిగి ఓడిపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరినా.. కొన్ని నెలల నుంచి కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉంటున్నారు. తనకున్న పరిచయాలను ఉపయోగించి తమ కేడర్‌ను బరిలో దింపి గెలిపించుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

త్వరలో తుది ఓటరు జాబితా..

ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాల కోసం అడుగులు వేస్తుండటంతో అందరి దృష్టి మున్సిపల్ ఎన్నికలపై పడింది. మున్సిపల్ ఎన్నికల కోసం కూడా అధికారులు అంతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు వార్డుల వారీగా ఓటరు జాబితాను కూడా సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే ఈ ప్రక్రియ కోసం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిసింది. ఈ ప్రక్రియ పూర్తి కాగానే త్వరలోనే తుది ఓటరు జాబితా రూపొందించనున్నారు. అలాగే వార్డుల వారీగా రిజర్వేషన్ ప్రక్రియను ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. త్వరలోనే ఓటరు జాబితా సవరణ చేపట్టనున్నారు. గతంలో చనిపోయిన వారి పేర్లను తొలగించనున్నారు.

భార్యను చంపిన భర్త అరెస్టు



సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న సీఐ వేణుచందర్

జైపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్వ గ్రామంలో భార్యను చంపిన భర్త గోదారి రాజయ్యను అరెస్టు చేసినట్లు శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్ పేర్కొన్నారు. సోమవారం జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీధర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..గోదారి రాజయ్య అతడి భార్య రాజమణిని ఈ నెల 2న అర్ధరాత్రి కర్రతో తలపై కొట్టి హత్య చేశాడు. రాజయ్య సింగరేణి కార్మికుడిగా పనిచేసి రిటైర్ అయ్యాడు. అతనికి వచ్చే పెన్షన్ డబ్బులు ఇంట్లో ఇవ్వకుండా తాగడానికి వాడుకునేవాడు. ఈ క్రమంలో పెన్షన్ డబ్బులు అడిగినందుకు భార్య రాజమణిని కొట్టేవాడు. ఆమె అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తుండేది. జీతం డబ్బులు ఇవ్వాలని నిత్యం ఆమెతో గొడవపడేవాడు. ఇంతకుముందు రెండు సార్లు రాజన్న తన భార్యను చంపే ప్రయత్నం చేసినప్పటికీ సఫలం కాలేదు. ఈ క్రమంలో భార్యతో గొడవ పడి ఆమెను చంపాలనే ఉద్దేశ్యంతో ఇంట్లో ఉన్న కర్రతో తల వెనక భాగంలో కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మండల కేంద్రంలోని పవర్ ప్లాంట్‌సమీపంలో తిరుగుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించడంతో నేరాన్ని ఒప్పుకున్నాడు. భార్యను చంపడానికి ఉపయోగించిన కర్రను పోలీసులు స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చినట్లు పోలీసులు పాల్గొన్నారు.

గోడకూలి అడ్డా కార్మికుడి మృతి

మంచిర్యాలక్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం మజీద్‌వాడకు చెందిన డోకే లచ్చన్న(35) అడ్డా కార్మికుడు మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం బెజ్జూర్ మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన డోకే లచ్చన్న మజీద్ వాడలో అద్దెకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంచిర్యాల పట్టణం గోదావరి రోడ్డులో ఓ పాఠశాలలో మరమ్మతులు చేస్తుండగా గోడ కూలి ప్రమాదవశాత్తు మృతిచెందాడు. లచ్చన్నకు భార్య బుదక్క, కుమారులు వరుణ్, వినయ్, కుమార్తె అక్షర ఉన్నారు. ఈ విషయమై ఎస్ఐని వివరణ కోరగా తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గుంత తవ్వారు... పూడ్చడం మరిచారు

శ్రీరాంపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు ప్రాణసం కటంగా మారింది. ఎవరికి వారు తమ పని పూర్తయ్యిందని వెళ్లిపోగా... తవ్విన గుంత ప్రజలకు ప్రమాదకరంగా మారింది. విద్యుత్ శాఖ అధికారులు క్రిష్టాకాలనీలోని కుర్మవాడలో ఉన్న ఓ కరెంట్ వైర్‌కు ఎర్త్ వైర్ వేసేందుకు ఇటీవల గుంత తవ్వారు. ఎర్త్ వైర్ సంగతి అటుంచితే ఆ పనిచేసే సమయంలో సింగరేణి క్వార్టర్లకు సరఫరా చేసే నీటి పైపులు పగిలిపో యాయి. దీంతో సింగరేణి అధికారులు స్పందించి రెండు రోజులు కష్టపడి నీటి సరఫరాను పునరుద్ధరించారు. కానీ అదే సమయంలో అక్కడ స్థానికులకు గృహావసరాలకు నీటిని సరఫరా చేసే మున్సిపల్ బోరు చుట్టూ తవ్వేశారు. దీంతో ఆ నీరు రాకుండా పోయింది. ఇటు విద్యుత్ శాఖ అధికారులు, అటు సింగరేణి అధికారులు తమ పని తాము చేసుకుని వెళ్లిపోయారు. కానీ గుంత మాత్రం అలాగే మిగిలిపోయింది. అది ఎక్స్‌కావేటర్‌తో తవ్వింది కావడంతో పెద్దగా ఉంది. అందులో వర్షపు నీరు నిలిచి తటాకాన్ని తలపిస్తోంది. పైగా క్రిష్టాకాలనీ నుంచి సీసీసీ వైపు వెళ్లేదారి మూలమలుపు వద్ద ఉండడంతో అందులో వాహనదారులు పడిపోయే అవకాశం ఉంది. అంతేకాకుండా ఆ కాలనీలోని పిల్లలు గుంతలో పడే ప్రమాదం నెలకొంది. అధికారులు ఎవరి పనివారు చేసి వెళ్లిపోయారని, గుంత పూడ్చకపోవడంతో ప్రమాదకరంగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. అంతేకా కుండా గృహావసరాలకు వినియోగించే బోరు ఉపయోగంలో లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చడంతో పాటు బోరు మోటారు పనిచేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న గుంత

అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

బెజ్జూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణపల్లి గ్రామంలో సోమవారం పోషణ వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో సిర్పూర్ ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి, సూపర్‌వైజర్ కరుణ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని సూ పర్‌వైజర్‌కు సుచించారు. కార్య క్రమంలో అంగన్‌వాడి కార్యకర్త శారద తదితరులు ఉన్నారు.

రెబ్బెన (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్‌లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వినోద్, అంగన్వాడీ టీచర్స్ కళాశతి, శోభారాణి, డి పోసు, బానక్క పాల్గొన్నారు.



నారాయణపూర్‌లో అన్నప్రాసన నిర్వహిస్తున్న సిబ్బంది

రైతులకు నానో యూరియా మేలు



నానో ఎరువుపై అవగాహన కల్పిస్తున్న ఏవో రామక్రిష్ణ

కాగజ్‌నగర్ టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): నానో యూరియా వలన రైతులకు ఎంతో ఉపయోకరమని కాగజ్‌నగర్ వ్యవసాయాధికారి రామక్రిష్ణ అన్నారు. సోమవారం మండలంలోని నజ్రూల్ నగర్, జంబుగ, సీతానగర్ తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్‌లో ఒక బస్తా యూరియా ధర రూ. 266 ఉండగా, నానో యూరియా అర లీటర్ కేవలం 225 రూపాయలు మాత్రమేనన్నారు. బస్తాలో లభించే యూరియా ప్రభావం కేవలం రెండు రోజులుంటే, నానో యూరియా ప్రభావం మొక్కలపై వారం రోజుల పాటు ఉంటుందన్నారు. వాతావరణం కాలుష్యం కాకుండా ఉండడంతో పాటు భూసారం దెబ్బతినకుండా ఉంటుందని వివరించారు. పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రైతులు పీఎం కిసాన్ కోసం ఈకేవైసి చేసుకోవాలని సూచించారు. ఎలాంటి సమస్యలు, అనుమానాలు ఉన్న ఏఈవోలను సంప్రదించాలని వివరించారు.



కంపెనీకి రావాల్సిన బకాయిలు ఇప్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

శ్రీరాంపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన 39 వేల 600 కోట్ల రూపాయలు ఇప్పించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు వి. అనిల్ రెడ్డి, ఏరియా బ్రాంచ్ కార్యదర్శి పొనగంటి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ సాధించిన లాభాల నుంచి కార్మికులకు 40 శాతం లాభాలు అందించాలన్నారు. ఇటీవల షై రిఫరల్ ఉద్యోగులకు 9 నెలల తరువాత ఫిట్ ఫర్ సేమ్ జాబ్ ఇవ్వడంతో ఆర్థికంగా చాలా నష్టపోయారన్నారు. వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దుర్గం లక్ష్మణ్, పిట్ కార్యదర్శులు వినయ్, లక్ష్మణ్, శశిధర్, చెవుల శ్రీనివాస్, సాయి, వెంకటస్వామి, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని సింగరేణి కాలరీస్‌లో అధికారికంగా నిర్వహించాలని సింగరేణి బీసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు జీఎం ఎం శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీసీ లైజన్ అధికారి సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు ముష్కె సమ్మయ్య, పేరం రమేష్, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శులు బరుపటి మారుతి, బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లాభాల వాటా 35 శాతం అందించాలి

ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి జనక్ ప్రసాద్

శ్రీరాంపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ సాధించిన లాభాల నుంచి కార్మికులకు 35 శాతం అందించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి జనక్ ప్రసాద్ అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల సొంతింటి పథకం అమలు, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మాఫీ, మారుపేర్ల సమస్యలను పరిష్కరించాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించినట్లు పేర్కొన్నారు. న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సింగరేణి వ్యాప్తంగా యాత్ర చేపట్టనున్నట్లు వివరించారు. ఈ నెల 7వ తేదీన అన్ని గనులు, విభాగాలపై నల్లబ్యాడ్జీలతో నిరసన, 14న జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా, వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో 21వ తేదీన కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. ఆయా కార్యక్రమాల నిర్వహణకు ఇన్‌చార్జిలను నియమించామన్నారు. సింగరేణి యాజమాన్యం 13 నెలలుగా రక్షణ సమావేశాలు నిర్వహించడం లేదని, ఈ విషయంపై ఏఐటీయూసీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. జూలై 31న నిర్వహించిన మెడికల్ బోర్డు ఫలితాలు చాలా అన్యాయంగా ఉన్నాయన్నారు. షైరిఫరల్ కోసం పంపిన వారికి తొమ్మిది నెలల క్రితమే ఫలితాలు తెలియజేయాల్సి ఉండేదన్నారు. ఈ విషయంలో గుర్తింపు సంఘం విఫలమైందని విమర్శించారు. సమావేశంలో కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షులు ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్ రావు, ప్రధాన కార్యదర్శులు ఏనుగు రవీందర్ రెడ్డి, జీవన్ జోయల్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంశెట్టి నరేందర్, ఉప ప్రధాన కార్యదర్శి గరిగె స్వామి, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనక్ ప్రసాద్

కార్మికుడి మృతికి సంతాపం

మందమర్రిటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియాలోని కేకే 5 గనిలో జరిగి న ప్రమాదంలో మృతిచెందిన యాక్టింగ్ ఎస్‌డీఎల్ ఆపరేటర్ శ్రావణ్‌కుమార్ సంతాప సభను కేకే గనిపై నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో గని మేనేజర్ శంభునాథ్ పాండే, రక్షణాధికారి రమేష్, ఏఐటీ యూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సుదర్శన్, కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్, టీబీజీకేఎస్ నాయకులు మేడిపల్లి సంపత్ పాల్గొన్నారు.

కాసిపేట: మందమర్రి డివిజన్ పరిధిలోని కేకే5 గనిలో ఎస్‌డీఎల్ ఆపరేటర్ శ్రావణ్ కుమార్ మృతికి సంతాపంగా కాసిపేట గనిపై కార్మికులు, అధికారులు సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐటీయూటీసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగాం మల్లేశ్, గని సేఫ్టీ ఆఫీసర్ నిఖిల్ అయ్యర్, డిప్యూటీ మేనేజర్ వెంకటేశ్వర్లు, బ్రాంచి ఆఫీసు బేరర్లు నాగేశ్వర్‌రావు, పిట్ కార్య దర్శి మీనుగు లక్ష్మీనారాయణ, వెల్ఫేర్ ఆఫీసర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రంజిత్‌కుమార్, అశోక్, గణేష్, శ్రీహరి, కమలాకర్, సేఫ్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కేకే 5 గని వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, కార్మికులు

కార్మికుల రక్షణలో యాజమాన్యం నిర్లక్ష్యం

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ కార్మికుల రక్షణ విషయంలో నిర్లక్ష్యం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు పేర్కొన్నారు. సోమవారం మంచిర్యాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిలో ఉత్పత్తి, లాభాలే తప్ప కార్మికుల ప్రాణాలకు విలువ లేదా అని ప్రశ్నించారు. కార్మికులకు రక్షణ కల్పించడంలో యాజమాన్యం విఫలమవుతోందన్నారు. రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో కార్మికులు ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. యాజమన్యాం నిర్లక్ష్యానికి నిరసనగా ఈ నెల 6న సీపీఎం ఆధ్వర్యంలో తలపెట్టిన మందమర్రి జీఎం కార్యాలయం ముట్టడికి సీఐటీయూ మద్దతునిస్తోందన్నారు. ఇందులో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్‌లకు కట్టబెట్టాలని చూస్తోందని, దీన్ని తిప్పికొట్టేందుకు కార్మికులందరు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు దుంపల రంజిత్ కుమార్, దూలం శ్రీనివాస్, గుమాస ప్రకాష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారంపై మంత్రి ఫోకస్

మందమర్రిటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగుల సమస్యలు, సంక్షేమంపై రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి జి వివేక్‌వెంకటస్వామి దృష్టిసారించినట్టు తెలుస్తోంది. దీనిలో భాగంగా ఇప్పటికే సమస్యలను, ఉద్యోగుల వివరాలను కూడా సేకరించారు. సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు కార్మిక సంక్షేమానికి చేపట్టాల్సిన అంశాల గురించి విధివిధానాలను రూపొందించినట్లు సమాచారం. తెలంగాణకు తలమానికమైన సింగరేణి సంస్థకు కార్మికులు వేల కోట్ల లాభాలు తీసుకువస్తున్న నేపథ్యంలో ప్రధానంగా ఉన్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లే యోచనలో ఉన్నారు. వైద్యానికి సంబంధించి సింగరేణి వైద్యశాలల్లో ఉద్యోగులకు, వారి కుటుంబాలకు అందుతున్న వైద్య సౌకర్యాలను మెరుగుపర్చాలని, సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాలనే నిర్ణయంతో ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆయన సింగరేణి ఉన్నతాధికారులతో ఒక సమావేశం ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారని సమాచారం. మందమర్రిలోని కేకే 5 గని ప్రమాదంలో ఉద్యోగి మృతిచెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. సింగరేణి అన్నిఏరియాల్లో ఉద్యోగులకు, వారి కుటుంబీకులకు మెరుగైన కల్పించాలనేది తన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. సంస్థలో వినూత్న మార్పులు చేయడానికి దృష్టి సారించాలని సంస్థకు సూచించారు. సింగరేణిలో ఉపాధి అవకాశాలు కల్పించడానికి కొత్తగనులు రావాలని పేర్కొంటున్నారు. ఉపాధి అవకాశాల పెంపు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మంత్రి దృష్టి సారించారు.

కార్పొరేట్ మెడికల్ బోర్డులో కార్మికులకు అన్యాయం

జైపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గత నెల 30, 31 తేదీల్లో జరిగిన కార్పొరేట్ మెడికల్ బోర్డులో కార్మికులకు అన్యాయం జరిగిందని, దీన్ని వెంటనే సవరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఐకే 1ఏ గని వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. డిసెంబర్ నుంచి హయ్యర్ రిఫరల్ సెంటర్ పేరుతో హైద్రాబాద్ కార్పొరేట్ ఆసుపత్రులకు పంపించి ఎనిమిది నెలల తర్వాత ఈసారి 52 మంది కాఇర్మకుల్లో కేవలం నలుగురినే మెడికల్ ఇన్వాల్యూడేట్ చేశారని, మిగితా వారిని ఫిట్ ఫర్ సేమ్ జాబ్‌గా పేర్కొన్నారన్నారు. సర్ఫేస్‌లో పనిచేస్తున్న ఎలక్ట్రిషియన్‌ను కూడా అన్‌ఫిట్‌గా చేసి జనరల్ మజ్దూర్‌గా మార్చడం వంటి నిర్ణయాలు తీసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో లాగానే 70, 80 శాతం మందిని మెడికల్ అన్‌ఫిట్ చేసి, 1981లో ఏఐటీయూసీ నేత మనుబోతుల కొమురయ్య ఒప్పందం ప్రకారం వారి వారసులకు ఉద్యోగాలు కల్పించాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేశారు. తద్వారా కార్పొరేట్ మెడికల్ బోర్డులో జరుగుతున్న పైరవీలకు అడ్డుకట్ట వేయవచ్చని తెలిపారు. మెడికల్ బోర్డుకు హాజరైన కార్మికులకు న్యాయం చేయాలని యాజమాన్యాన్ని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శులు నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, సహాయ కార్యదర్శి ధరణి దేవేందర్, నాయకులు సురేష్, నవీన్, రాజ్‌కుమార్, కేశవ్, హన్మంతు, సంజీవ్, యూసఫ్, వెంకటేష్, రమేష్ పాల్గొన్నారు.

ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు అలవెన్స్ ఇవ్వాలి

మందమర్రిటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి ఏరియాలో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డులకు పెరేడ్స్ అలవెన్స్ ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొన్ని రోజులుగా యాజమాన్యం పరేడ్ అలవెన్స్ ఇవ్వడం లేదన్నారు. దీంతో సెక్యూరిటీ గార్డులు నష్టపోతున్నారన్నారు. సెక్యూరిటీ గార్డులకు పరేడ్‌పై అవగాహన కల్పించాలని ఆ తర్వాతనే పరేడ్ చేయించాలని సూచించారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పెరేడ్ అలవెన్స్‌లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాబోయేది డబుల్ ఇంజన్ సర్కారే

బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

మందమర్రిటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో రాబోయేది బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్‌లు తెలిపారు. సోమవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన ఏ ఒక్క హామీని సంపూర్ణంగా నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో పార్టీ నూతన అధ్యక్షుడిగా రాంచందర్‌రావు నియమితులైన తర్వాత ప్రజల సమస్యలపై పోరాట కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పలు నియోజకవర్గాల పర్యటనకు సిద్ధమయ్యారన్నారు. నేడు మందమర్రిలో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు పర్యటించనున్నారని తెలిపారు. ఆయనకు సింగరేణి, ప్రజల సమస్యలను విన్నవిస్తామన్నారు. స్వాగతం యాత్రను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నాయకులు, కార్యకర్తలు తరలి రావాన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా, పట్టణ నాయకులు అందుగుల శ్రీనివాస్, దీక్షితులు, మోహన్, సంజీవరావు, రాజమల్లు, వేణు, జనార్ధన్, ధన్ సింగ్, రవి, శరత్, శేఖర్ పాల్గొన్నారు.

గడప గడపకూ బీజేపీ

కోటపల్లి : మండలంలోని కొండంపేట గ్రామంలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో గడప గడపకు బీజేపీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ పార్టీ మండల అధ్యక్షురాలు పెద్దింటి స్వప్నపున్నంచంద్, జిల్లా జనరల్ సెక్రటరీ దుర్గం అశోక్‌ల ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గడప గడపకు వెళ్లి బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన 50 మంది బీజేపీలో చేరారు. ఎన్నికల కన్వీనర్ మంత్రి రామయ్య, నాయకులు కాశెట్టినాగేశ్వర్‌రావు, వడ్లకొండ రాజేష్, వెంకటేష్, శ్యాంసుందర్, నర్సింహులు, అంకయ్య, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు.

రేషన్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు రేషన్‌కార్డులను సద్వినియోగం చేసువాలని తహసీల్దార్ క్రిష్ణ, నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని పద్మశాలిభవన్‌లో నాయకులతో కలిసి తహసీల్దార్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ప్రభుత్వం రేషన్‌కార్డులను పంపిణీ చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరికి ఆరు కిలోల బియ్యం ఇస్తారని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని లబ్ధిదారులు ఎక్కడైన రేషన్ తీసుకునే సదుపాయం ఉందని తెలి పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, చంద్రశేఖర్, క్రిష్ణ, శ్రీధర్, మూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కిసాన్ సమ్మాన్ నిధులను పెంచాలి

తాండూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ప్రభుత్వం రైతులందరికి కిసాన్ సమ్మాన్‌నిధిని సంవత్సరానికి 12 వేలకు పెంచి ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దాగం రాజారాం పేర్కొన్నారు. సోమవారం తాండూర్ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం సంవత్సరానికి మూడు విడతలుగా రూ. 6 వేలు ఇస్తుందని, ఇది రైతులకు సరిపోవడం లేదన్నారు. పెరిగిన ధరల కు అనుగుణంగా రూ. 12 వేలకు పెంచి ఇవ్వాలన్నారు. కేంద్రం రైతుల కోసం ఎన్ని పథకాలు తెచ్చినా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదన్నారు. అలాగే కేంద్రం రైతుల కోసం తీసుకువచ్చిన విశిష్ట గుర్తింపు కార్డులపై రైతులం దరికి అవగాహన కల్పించి రైతులందరు నమోదు చేసుకునేలా వ్యవసాయాధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు వేల్పుల శంకర్, దుర్గం నానయ్య, సోమ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పారాయణం

మందమర్రిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి మండలంలోని మహిళలు మంచిర్యాలలోని ఆరోగ్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో సోమవారం భగవద్గీత పారాయణ హోమంలో పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళ భక్తులు భాగ్యలక్ష్మీ, భవానీ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల చన్నీటి స్నానం



- గురుకులాల్లో , కస్తూర్బా పాఠశాలల్లో పని చేయని సోలార్ హీటర్లు
- చేతి పంపులు, నీటి ట్యాంక్‌ల వద్ద చన్నీటి స్నానాలతో విద్యార్థుల అవస్థలు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు

బెల్లంపల్లి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల చదువుల కలసాకారం చేసేందుకు ప్రభుత్వ గురుకుల, కస్తూర్బాగాంధీ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. ఇందులో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగవద్దని వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. చన్నీటి స్నానం చేస్తున్నారని వారు పడుతున్న అవస్థలను గుర్తించి వేడి నీటిని అందించేందుకు గురుకులాల్లో, కస్తూర్బాల్లో సోలార్ హీటర్లను ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులు వర్షాకాలం, చలికాలం సమయంలో వేడి నీళ్లతో స్నానం చేయవచ్చునని సంతోషించిన కొన్నేళ్లకే వారి ఆశలు అడియాశలయ్యాయి.

నిరుపయోగంగా సోలార్ వాటర్ హీటర్లు..

జిల్లాలో కస్తూర్బా గాంధీ, గురుకులాలు షెడ్యూల్ కులాల వసతి గృహాలు ఉన్నాయి. ఇందులో వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరందరికి పదేళ్ల క్రితం వేడి నీటి సరఫరాకు వీలుగా సోలార్ వాటర్ హీటర్లను ఏర్పాటు చేశారు. వర్షాకాలం, చలికాలం చన్నీటి స్నానాలు చేసి విద్యార్థులు అనారోగ్య సమస్యలు ఎదురువుతాయనే ఉద్దేశ్యంతో సోలార్‌హీటర్లను ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. ఏర్పాటు చేసినప్పటి నుంచి వాటి నిర్వహణను ఐదేళ్లపాటు సంబంధిత సంస్థ చూసింది.

ఐదేళ్ల అనంతరం నిర్వహణను పట్టించుకోకపోవడంతో పలు గురుకులాల్లో, కస్తూర్బా విద్యాలయాల్లో పని చేయడం లేదు. దీంతో విద్యార్థులు వర్షాకాలం, చలికాలంలో చన్నీటి స్నానం చేయాల్సిన పరిస్థితి నెలకొంటుంది. సోలార్ హీటర్లను మరమ్మతులు చేపించకపోవడంతో మూలనపడ్డాయి. నిత్యం చన్నీటితో స్నానం చేస్తే తమ పిల్లల ఆరోగ్యం దెబ్బతింటుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మొదలైన చన్నీటి స్నానం కష్టాలు...

జిల్లా వ్యాప్తంగా గత పదిహేను రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వసతి గృహాల్లోని విద్యార్థులు ఉదయం స్నానం చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు వర్షంతో చల్లగా అవుతున్న వాతావరణంతో విద్యార్థులు గజగజవణుకుతూ వాటర్ ట్యాంక్‌ల కింద, చేతిపంపుల దగ్గర స్నానాలు చేస్తున్నారు. సోలార్ వాటర్‌హీటర్‌లు పని చేయకపోవడంతో సకాలంలో తరగతులకు హాజరుకావాలని ఉద్దేశంతో తప్పనిసరి పరిస్థితుల్లో చన్నీటి స్నానాలు చేస్తూ అనారోగ్య భారినపడుతున్నారు.

వర్షాకాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులతో పాటు జ్వరాల వ్యాపిస్తున్న నేపథ్యంలో చన్నీటి స్నానాలు చేస్తే సర్ది, జలుపు, దగ్గు, తల నొప్పి, వైరల్ ఫీవర్ వంటివి వస్తున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షల రూపాయలతో కొనుగోలు చేసిన సైలార్ వాటర్ హీటర్లను మరమ్మ తులు చేయించి విద్యార్థులకు అందుబాటులోకి తీసు కురావాలని తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ డిప్యూటి డైరెక్టర్ దుర్గ ప్రసాద్‌ను వివరణ కోరగా వసతి గృహాల్లో సోలార్ వాటర్ హీటర్లు పని చేయనివాటిని గుర్తించి మరమ్మతులు చేయించి విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

సోలార్‌వాటర్‌హీటర్లకు మరమ్మతులు చేయించాలి...

అంజన్న, వసతి గృహం విద్యార్థి, బెల్లంపల్లి



పనిచేయకుండా నిరుపయోగంగా ఉన్న సోలార్‌వాటర్ హీటర్లను మరమ్మతులు చేయించాలి. మేమందరం చన్నీళ్ల స్నానం చేస్తే అనారోగ్యాల భారినపడుతున్నాం. చన్నీటి స్నానం చేయాలంటే వణుకు వస్తుంది. వాటర్‌హీటర్లను అందుబాటులోకి తీసుకొస్తే ఎంతో మంది విద్యార్థులకు మేలు జరుగుతుంది.

చన్నీళ్లతో ఇబ్బందులు పడుతున్నాం...

తిరుమలేశ్, వసతిగృహం విద్యార్థి



వర్షాకాలం, చలికాలం చన్నీళ్ల స్నానం చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం. వాతావరణం చల్లగా ఉంటుంది. దీనికి తోడు చన్నీళ్లస్నానం చేస్తుండడంతో జలుబు, దగ్గుతో పాటు జ్వరాలకు తీరుస్తుంది. మా వసతి గృహంలో సోలార్‌వాటర్‌హీటర్ ఉన్నప్పటికీ పనిచేయకపోవడంతో నిరుపయోగంగా ఉంటుంది.

పురుగుల మందు పిచికారి చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

కాసిపేట, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట పొలాలు పత్తి చేనులో రసాయనిక మందులు పిచికారి చేసేటప్పుడు సరైన జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ అన్నారు. సోమవారం కోమటిచేనులో ఆయన రైతులకు పత్తి పంటలు పిచికారి విధానంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన మందులు పిచికారి చేసేటప్పుడు మొఖానికి మాస్కు, చేతులకు గ్లౌజులు, కల్లజోడ్లతో పాటు కాళ్లకు బూట్లు ధరించాలి. పిచికారి చేసిన అనంతరం చేతులను సబ్బుతో మొఖాన్ని శుభ్రంగా కడుకోవ్వాలి. పొలాలకు మందు వేసేటప్పుడు నీళ్ల తాగడం, పొగత్రాగడం లాంటి, అన్నం తినడం మానుకోవాలి. పిచికారి అనంతరం కాళ్లు, చేతులు శుభ్రంగా కడుకున్న తరువాతనే భోజనం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఓలు, రైతులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం

బెల్లంపల్లి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): మాజీ కౌన్సిలర్ తోడే వంశీ కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి సోదరుడు అమెరికాలో నివసిస్తున్న వెంకటకృష్ణ రెడ్డి నగదును పంపడంతో సీసీ కెమెరాల కోసం రూ.30 వేల నగదును వన్‌టౌన్ పోలీసులకు న్యాయవాది రాకేశ్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్‌లు అందజేశారు. అలాగే రూ.2లక్షలతో బెల్లంపల్లిలోని గ్రంథాలయంలో పలు వసతులకు, యువతకు పోటీపరీక్షల మెటీరియల్‌ను అందజేసినట్లు తెలిపారు.

మొసళ్ల అభయారణ్యానికి..ఆదరణ కరువు

(5వ పేజీ తరువాయి)

ప్రదేశంలో చక్కగా చెక్కిన రాతి స్తంబాలు, రాతి ఇటుకలు, రాతి గడీలు పరిచి ఉన్నాయి. గుహలు, గుహల బయట చక్కని ప్రణాళికతో నిర్మించిన నివాసాలు, ఆరామాలు కనిపిస్తున్నాయి. ఈ నాలుగు గుహలు క్రీ.పూ. 1,2 శతాబ్దాల వాటివని చరిత్రకారులు అభిప్రాయపడుతుంటారు.

వణ్య సంపదకూ నిలయం..

మొసళ్ల అభయారణ్యం ఎన్నో రకాల అటవీ సంపదకు నిలయం. ఇక్కడ ఎన్నో వృక్ష, పక్షి, జంతుజాతులు ఉన్నాయి. చుక్కల దుప్పులు, నీలుగాయిలు, నీటి పిల్లులు, అడవిపందులు, ముళ్ల పందులు, జింకలు, కొండ గొర్రెలు, నీటి కుక్కలు వంటి జంతుజాతులు ఇక్కడ నివసిస్తున్నాయి. నెమళ్లు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వృక్ష సంపదలో నల్ల మద్ది, చెన్నెంగ, బూరుగు, అందుగు, కొడిశ, పాలవంటి అరుదైన వృక్షజాతులు ఉన్నాయి. యేటా ఇక్కడకు పెద్ద ఎత్తున పర్యాటకులు వస్తుంటారు. ఎండాకాలం కూడా ఇక్కడ నీరు ఎండిపోకుండా ఉండటంతో చాలా మంది కుటుంబాలతో కలిసి సందర్శిస్తుంటారు. పర్యాటకులు నదిలో షికారు చేసేందుకు బోటింగ్ సౌకర్యం ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుతం అది పనిచేయడం లేదు. అయితే ప్రభుత్వాల నిర్లక్ష్యంతో కనుల విందు చేసే పర్యాటక ప్రాంతం ప్రస్తుతం ఆలనా పాలనలేక కళావిహీనంగా దర్శనమిస్తోంది. టూరిజం సర్క్యూట్‌లో భాగంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ మేరకు చర్యలు తీసుకోకపోవడంతో పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. రాష్ట్రంలో కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వ మైనా మొసళ్ల అభయారణ్యాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావే జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ప్రాతినిథ్యం వహిస్తుండగా, మరో మంత్రి గడ్డం వివేకానంద సొంత నియోజకవర్గం చెన్నూరు పరిధిలోనిది అయినందున మంత్రులిరువురూ మొసళ్ల అభయారణ్యంపై ప్రత్యేక చొరవ తీసుకుంటారనే ఆశాభావంలో పర్యావరణ ప్రేమికులు ఉన్నారు.

108లో ప్రసవం

కన్నెపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లి మండల కేంద్రానికి చెందిన చెండె సుగుణ అనే గర్భిణి ఆదివారం రాత్రి 108 అంబులెన్స్‌లో ఆడపిల్లకు జన్మనిచ్చింది. సుగుణకు పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో తరిస్తుండగా తాళ్లగురిజాల గ్రామ సమీపంలోకి రాగానే నొప్పులు అధికం కావడంతో 108 సిబ్బంది ప్రసవం చేయగా ఆడపిల్లకు జన్మనిచ్చింది. దీంతో ఈఎన్‌టీ రాకేష్, పైలెట్ రంజిత్, ఆశాకార్యకర్త వాణికి సుగుణ కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు అవగాహన

మందమర్రిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆదిల్‌పేట గ్రామంలో సోమవారం ఏఈవో ముత్యం తిరుపతి వరి పొలంలో గట్లు కత్తిరించడం వల్ల జరిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పొలంలో నారుమడులను సూచించే గట్లను ఒక వైపుగా తప్పనిసరిగా కత్తిరించుకోవాలన్నారు. ఇలా కత్తిరించడం వల్ల పొలం గట్లపై వెళ్లే కలుపు మొక్కలను, కీటకాలు ఆశ్రయం ఇచ్చే కలుపును నివారించవచ్చ న్నారు. రైతులకు ఏమైనా ఉంటే తమను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను అందుబాటులోకి తేవాలని వినతి

మందమర్రిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పొన్నారం గ్రామంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌ను అందుబాటులోకి తేవాలని కోరుతూ సోమవారం విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షుడు బచ్చలి ప్రవీణ్ జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. పొన్నారం గ్రామంలో ఎస్సీ హాస్టల్ ఉన్నా వార్డెన్ లేక, సిబ్బంది కొరత వల్ల నిరుపయోగంగా ఉందన్నారు. నిరుపేద విద్యార్థులను దృష్టిలోఉంచుకుని వెంటనే హాస్టల్‌ను అందుబాటులోకి తీసుకురావాలని, రెగ్యులర్ వార్డెన్‌ను నియమించాలని కోరారు.

భూ సమస్య పరిష్కరించాలి

మందమర్రిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పులిమడుగు గ్రామానికి చెందిన రాజేష్ నాయక్ తన భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఎంపీడీవో రాజేశ్వర్‌కు ఫిర్యాదు అందించారు.

ఆయన మాట్లాడుతూ తమభూమిలో ఇందిరమ్మ ఇళ్లు కట్టు కుందామనుకుంటే కొందరు అడ్డు పడుతున్నారని, తన సమస్యను పరిష్కరించాలని కోరారు.

చలో ఢిల్లీకి తరలిన నాయకులు

జైపూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్‌ల అమలు కోసం ఈ నెల 5న పార్లమెంట్‌లో బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలని కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన ఛలోఢిల్లీ కార్యక్రమానికి మండల బీసీ, కాంగ్రెస్ నాయకులు గణేష్, నగేష్, సిసిందర్ ,సతీష్, వెంకటేష్,కిరణ్‌గౌడ్, అశోక్‌లు తరలి వెళ్లారు. సోమవారం మంచిర్యాల రైల్వేస్టేషన్ నుంచి రైలులో ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అంతకుముందు వారు మాట్లాడుతూ ఈ నెల 5న పార్లమెంట్ బిల్లు ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తేవడానికి, 6న జంతర్ మంతర్ వద్ద జరిగే నిరసనలో, 7న రాష్ట్రపతికి విజ్ఞాపన పత్రం సమర్పించనున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్‌లో బంగారు పతకం



బంగారు పతకం సాధించిన సింబాకు అభినందనలు తెలుపుతున్న సీపీ

మంచిర్యాలక్రైం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్‌లో రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో సింబా గోల్డ్‌మెడల్ సాధించిందని ఈ సందర్భంగా పోలీసు కమిషనరేట్ నార్కోటిక్ సింబాకు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అభినందనలు తెలిపారు. వరంగల్ జిల్లాలో జరిగిన రాష్ట్ర రెండవ పోలీసు డ్యూటీ మీట్‌లో కాళేశ్వరం జోన్ నుంచి నార్కొటిక్ డాగ్ విభాగం పోటీల్లో పాల్గొని గంజాయి, మత్తు పదార్థాలను గుర్తించడంలో పోలీసు జాగిలం సింబా, డాగ్ హాండ్లర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ క్రిష్ణ గోల్డ్‌మెడల్ సాధించిందని ఈ సందర్భంగా తెలిపారు.

రాష్ట్ర ఉత్తమ పోలీసు డాగ్‌గా సింబా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. 2026 సంవత్సరం ఫిబ్రవరిలో పుణేలో జరిగే నేషనల్ పోలీసు డ్యూటీ మీట్‌లో సింబా మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ భాస్కర్, పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఎల్ దామోదర్, శ్రీనివాస్, వామన మూర్తి సంపత్, మల్లేశం పాల్గొన్నారు.

మార్కండేయస్వామికి మహా రుద్రాభిషేకం



దండేపల్లిలో భక్త మార్కండేయ స్వామి ఆలయంలో భక్తులు

దండేపల్లి ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస రెండో సోమవారం పురస్కరించుకుని దండేపల్లిలో స్థానిక భక్త మార్కండేయస్వామి దేవాలయంలో శ్రావణ పూజలను భక్తులు భక్తిశ్రద్ధలతో శివుడికి మహా రుద్రాభిషేకం నిర్వహించారు. మండలంలోని గూడెం శ్రీసత్యనారాయస్వామి దేవాలయాల్లో శ్రావణమాస పూజలతో శోభ సంతరించుకుంది. ఉదయం నుంచి ఆలయాలకు భక్తులు కుటుంబసమేతంగా వచ్చి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ పెరగడంతో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది తగు ఏర్పాటు చేశారు. అనంతరం పలు గ్రామాలోని శ్రీసతారామాం జేయస్వామి, మ ల్లిఖార్జున్‌స్వామి, శివాలయం, మార్కండేయస్వామిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

గ్రామంలోని సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో గల పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం తహసీల్దార్‌కు బీఆర్‌ఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టకపో వడంతో సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యాల భారిన పడుతున్నారన్నారు. మిషన్ భగీరథ, మంచినీటి పైపులు లీకై తాగునీరు కలుషితమవుతుందన్నారు. గ్రామాల్లో ఫాగింగ్, బయోటెక్ స్ప్రే చేయకపోవడంతో దోమలు వ్యాప్తి చెంది జ్వరాల భారిన పడుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్‌రావు, సర్పంచ్‌లు అశోక్‌గౌడ్, వెంకటేశ్, నాయకులు గనేష్‌గౌడ్, చిరంజీవి, వెంకటస్వామి, అశోక్‌లు పాల్గొన్నారు.

లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

జన్నారం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రంలోని కవ్వాల్ హాస్టల్ తండా గ్రామానికి చెందిన శ్రీనివాస్ నాయక్‌ను నియమించినట్లు లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మడావత్ రాంబాల్ నాయక్ హైదరాబాద్‌లోని లంబాడ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో ఉత్తర్వులు నియామక పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ లంబాడీల అభివృద్ధికి వారిని చైతన్యం చేసేందుకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. సంఘ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

గొర్రెలకు వ్యాధి నిరోధక టీకాలు

తాండూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం గొర్రె లకు నీలి నాలుక వ్యాధి నివారణ టీకాలను వేసినట్లు మండల పశువైద్యాధికారి నర్సింహారావు తెలిపారు. నీలి నాలుక వ్యాధి ప్రధానంగా గొర్రెల్లో నోరు, ముక్కు నుంచి నీరు కారడం, జ్వరం, లాలాజలం కారడం ఉంటుందన్నారు. పశువైద్య సిబ్బంది మల్లేష్, కళ్యాణ్, గొర్రెల పెంపకం వృత్తిదారుల సంఘం నాయకులు ఐలయ్య, పార్వతాలు, దుర్కి, లక్ష్మణ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం



తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

చెన్నూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోమనపల్లి, నాగాపూర్, ఒడ్డు సోమనపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ముర్రుపాల ప్రాముఖ్యతను బాలింతలు, గర్భిణులకు వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు శోభారాణి, దేవేంద్ర, మాధవి, ఏఎన్‌ఎం హరితరెడ్డి, ఆశాలు సంతోష, ఉమారాణి పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: తల్లులు పిల్లలకు జన్మనిచ్చిన తర్వాత ఆరు నెలల వయస్సు వచ్చే వరకు పిల్లలకు తప్పకుండా తల్లిపాలనే పట్టించాలని లక్షెట్టిపేట ఎంఈవో శైలజ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో లక్షెట్టిపేట పట్టణంతో పాటు మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూర్‌లో సోమ వారం తల్లిపాల వారోత్సవాలను అంగన్‌వాడీ సెంటర్లలో ఘనంగా నిర్వహించారు. ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీడీపీవో రేష్మా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత, జెండర్ స్పెషలిస్టు విజయ, ఆర్థిక అక్షరాస్యత నిపుణులు లిప్పిక, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దండేపల్లి: ముర్రుపాలతో అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలతోనే శిశువుకు సంపూర్ణ ఆరోగ్యమని లక్షెట్టిపేట ఐసీడీఎస్ సీడీపీవో ప్రాజెక్టు అధికారిణి రేష్మ అన్నారు. దండేపల్లి, గూడెం సెక్టార్ పరిధిలోని ధర్మారావుపేట, దండేపల్లి అంగన్‌వాడి కేంద్రంలోని సోమవారం తల్లిపాల విశిష్టత గురించి అవగాహన కల్పించారు. గూడెం, దండేపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, రమాదేవి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సౌజన్య, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మంచిర్యాలలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. ఎస్ఆర్‌కేఎం కళాశాల విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నాటికను ప్రదర్శించారు. ఆసుపత్రి డీఎంహెచ్‌వో భీష్మ, మెడికల్ సూపరింటెండెంట్ హరీష్‌చందర్‌రెడ్డి పాల్గొన్నారు.






లక్షెట్టిపేటలో గర్భిణులకు సీమంతం చేస్తున్న ఎంఈవో, ధర్మారావుపేటలో అన్నప్రాసన చేస్తున్న సీడీపీవో రేష్మ

ఘనంగా గాజుల పండుగ

బెల్లంపల్లి,ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదకుర్తి గ్రామంలో శివగణేష్ భక్త మండలి ఆధ్వర్యంలో శ్రావణ సోమవారం సందర్భంగా మహిళలు సామూహికంగా గాజుల పండుగను నిర్వహించుకున్నారు. రంగురంగుల గాజులు మహిళలు ధరించారు. కుటుంబాల్లో కలతలు తొలగించి సంతోషాలను నింపే పండుగ గాజుల పండుగ అని మహిళలు పేర్కొన్నారు.

పంటల ఉత్పత్తుల మద్దతు ధర పెంపు

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమంలో భాగంగా ఖరీఫ్ సీజన్‌కు గాను పంట ఉత్పత్తులపైన కనీస మద్దతు ధరను పెంచడం జరిగిందని జిల్లా మార్కెటింగ్ అధికారి షహబుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. వరి సాధారణ రకానికి రూ.2,369, గ్రేడ్ ఏ రకానికి రూ.2389, జొన్నలు హైబ్రీడ్‌కు రూ. 3699, మాల్దండికి రూ. 3749, సజ్జలకు రూ.2775, రాగులకు రూ.4886, మొక్క జొన్నకు రూ.2,400, కందులకు రూ. 8 వేలు, పెసర్లుకు రూ.8768, మినుములు రూ.7800, పల్లికాయ రూ.7263, సోయాబీన్ రూ.5328, ప్రొద్దు తిరుగుడు రూ.7721, నువ్వులు రూ.9846, పత్తి మధ్యరకం గింజ రూ.7710, పొడవు రకం గింజ 8110 నిర్ణయించడం జరిగిందన్నారు.



మొసళ్ల అభయారణ్యానికి.. ఆదరణ కరువు



ఇసుకపై సేదదీరుతున్న మొసలి

- పక్షిజాతులు, వన్య ప్రాణులకు ఆవాసం
- ప్రభుత్వం దృష్టిసారించాలంటున్న పర్యావరణ ప్రేమికులు

మంచిర్యాల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జైపూర్ మండలం శివ్వారం గ్రామంలోని మొసళ్ల అభయారణ్యం అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వమైనా దృష్టిసారించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. టూరిజం సర్క్యూట్‌లో అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో హామీలు ఇచ్చినప్పటికీ అవి కార్యరూపం దాల్చకపోవడంతో పర్యాటకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జైపూర్ మండలం కుందారం నుంచి చెన్నూరు మండలంలోని బీరెల్లి వరకు సుమారు 15 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న గోదావరి నదిలోని మడుగు (ఎల్ మడుగు) మొసళ్లకు ఆవాసంగా ఉంది. నదితోపాటు దాని చుట్టూ ఉన్న అటవీ ప్రాంతాన్ని అటవీశాఖ మొసళ్ల అభయారణ్యంగా గుర్తించింది. మంచిర్యాల-పెద్దపల్లి జిల్లా మంథని మధ్యలో రెండు కొండల నడుమ విస్తరించిన గోదావరి అందాలొలుకుతూ చూపరులను ఇట్టే ఆకర్శిస్తోంది. 1978లో పుష్పకుమార్ అనే వైల్డ్ లైఫ్ నిపుణుడు ఈ ప్రాంతాన్ని సందర్శించి, ఇక్కడి ప్రకృతి సౌంద ర్యాన్ని చూసి ముగ్దుడై అభయారణ్యం, జీవజాతులపై అధ్యయనం చేసి అప్పటి ప్రభుత్వానికి నివేదికలు అందజేశారు. అప్పటి నుంచి ఈ ప్రాంతాన్ని మొసళ్ల పునరావాస కేంద్రంగా పిలుస్తున్నారు. ఎల్ మడుగు లో 50కిపైగా ఉప్పు, మంచినీటి మొసళ్లు ఉండగా, అటవీశాఖ ఆధ్వర్యంలో సంరక్షణచర్యలు చేపడుతున్నారు.

ఉట్టి పడుతున్న పూర్వవైభవం...

పురాతనమైన ఈ మొసళ్ల అభయారణ్యానికి కాకతీయ రాజులు వరంగల్ నుంచి పెద్దపల్లి జిల్లా మీదుగా శివ్వారం వరకు దారి ఏర్పాటు చేసినట్లు చరిత్ర కారులు చెబుతుంటారు. అప్పట్లో మునీశ్వరులు కూడా నివాసాలు ఏర్పాటు చేసుకున్న ఆనవాళ్లు ప్రస్తుతానికీ పదిలంగా ఉన్నాయి. జైపూర్ మండలం కేంద్రం నుంచి 28కిలోమీటర్ల దూరంలో శివ్వారం మొసళ్ల అభయారణ్యం ఉంది. ఎల్ మడుగు ఒడ్డున ఉన్న ఓ గుహ దాదాపు 250 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఇవి మానవ నిర్మిత గుహలు. ఇందులోని ఒక గుహలో ఇసుక రాతితో చెక్కిన ఎత్తయిన పానపట్టంతో శివ లింగం ఉంది. ఇక్కడ కనిపించే నాలుగు గుహాలయాలు బయటకు ద్వార స్తంభాలుగా, లోపల రాతి గద్దెలతో నిర్మించినదే వాలయాలను తలపిస్తుండగా, దీపాల గూడులతో, మలుపు తిరిగిన రాతి గోడలతో చదునైన రాతి నేతలతో బౌద్ధుల 'వస్సావాసా' (వర్షాకాలంలో బౌద్ధ భిక్షువులు నివసించే తాత్కాలిక ఆవాసాలు)ను తలపిస్తాయి. గుహలున్న ప్రదేశంలోనే లభించిన ముతక ఇటుకలు శాతవాహన కాలానికి చెందినవని చరిత్రకారులు చెబుతున్నారు. ఒక ద్వారం పక్కన గుర్రం మీద స్వారీ చేస్తున్న జంట శిల్పం కనువిందు చేస్తుంది. ద్వార స్తంభాలమీద పెట్టిన బ్రాకెట్లు, స్తంభాల శిల్పం పురాతన శైలిని ప్రతిబింబిస్తోంది. గుహల బయట కనిపిస్తున్న..

(తరువాయి 7లో)

నేటిలోగా 'ఓపెన్' పరీక్ష ఫీజు చెల్లించండి

దండేపల్లి ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): ఓపెన్‌స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో 2025- 26 విద్య సంవత్సరంలో టెన్త్, ఇంటర్‌లో చేరిన అభ్యాసకులు ఆగస్టు 5లోగా పరీక్ష ఫీజును చెల్లించాలని దండేపల్లి ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ నరేందుల శ్రీనివాస్, సహాయ కోఆర్డినేటర్ సంగర్స్ రాజేశ్వర్ రావులు సోమవారం ఓప్రకటలో తెలిపారు. సెప్టెంబర్‌లో ఓపెన్ టెన్త్, ఇంటర్ వార్షికప రీక్షలు జరుగుతాయన్నారు. 5సంవత్సరాలలో ఓపెన్ స్కూల్‌లో ప్రవేశం పొందిన వారు, ఫెయిల్ అయిన వారు అడ్మిషన్ నెంబర్ ద్వారా స్థానిక మీసేవ, ఆన్‌లైన్ కేంద్రా లల్లో పరీక్ష ఫీజు చెల్లించి ఆన్‌లైన్ ద్వారా రసీదు పొందాలన్నారు. ఓపెన్ స్కూల్‌లో చదువుకునే అభ్యాసకులు గడువులోగా పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకోసం 8309769067లో సంప్రదించాలన్నారు.

వర్షాకాలంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఈ ఉత్తమ్

మందమర్రిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో విద్యుత్ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఎస్ఈ జాడె ఉత్తమ్ పేర్కొన్నారు. సోమవా రం మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విద్యుత్ మీటర్లకు కెపాసిటర్లను బిగించుకోవాలన్నారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డీఈ కైసర్, ఏఈ ప్రభాకర్, జయకృష్ణ, లైన్‌మెన్ సతీష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులు... చన్నీటి స్నానం

- గురుకులాలు, కస్తూర్బా పాఠశాలల్లో పని చేయని సోలార్ హీటర్లు
- సమస్య పరిష్కరించాలని వేడుకోలు

7

పాఠశాలలో ఎన్నికలు

చెన్నూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని స్థానిక మహాత్మాజ్యోతిబాపూలే బాలుర పాఠశాల కళాశాలలో సోమవారం విద్యార్థి నాయకుల గుర్తింపు ఎన్నికలను అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థులే అభ్యర్థులుగా ఓటర్లుగా పాత్రలు పోషించారు. పాఠశాల స్థాయిలో స్పెషల్ డీఎస్‌పీఎల్, కళాశాల స్థాయిలో సీపీఎల్ డీసీపీఎల్ అభ్యర్థులుగా నిలబడి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా ఉపాధ్యాయులు విధులు నిర్వహించారు. గెలుపొందిన వారికి గుర్తింపు పత్రాలు అందజేశారు. కార్యక్రమం ప్రిన్సిపాల్ శ్రీకాంత్, ఏటీపీ రాజేందర్, శ్యాంసుదర్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పాఠశాలలో ఓటు వేస్తున్న విద్యార్థులు

అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామీణ స్థాయి నుంచి అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికబద్ధంగా చేపట్టి త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఎన్ఎంఎంఎస్ నిర్వహణలో భాగంగా సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని ఫొటోలు అప్‌లోడింగ్, జియోట్యాగింగ్ సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం పరిధిలో ఉన్న మురుగు కాలువల నిర్మాణం, ఇంకుడు గుంతల ఏర్పాటు, మొక్కల పెంపకంలో ఉద్యానమొక్కల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, జెడ్పీ సీఈవో గణపతి, డీపీవో వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా అధికారుల సమన్వయంతో కృషి చేస్తా మన్నారు. అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఆర్డీవోలు శ్రీనివాస రావు, హరికృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీష్‌రాజ్



దండేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీష్‌రాజ్

దండేపల్లి ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒకరికి మెరుగైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హరీష్‌రాజ్ సూచించారు. సోమవారం దండేపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాల న్నారు. వర్షాకాలం కాబట్టి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలోని వైద్యాధికారులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాల న్నారు. ప్రతి గ్రామాలోని వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి వ్యాధుల బారిన పడకుండా తగ్గు చర్యలు చేపట్టి, వ్యాదుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం ఆసుపత్రి రిజిష్టర్లు, రికార్డుల మందుల నిల్వల తీరు, పరిసర ప్రాంతాలను పరిశీలించి వైద్యా సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్ర మంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు డాక్టర్లు సతీష్, వంశీకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

జన్నారం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ హరీశ్ రాజ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేరా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఉమా శ్రీతో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ మరో వైద్యాధికారి లక్ష్మీ ఎలాంటి అనుమతులు లేకుండా సెలవు పెట్టగా ఆమెకు నోటీసులు జారీ చసినట్లు తెలిపారు. సిబ్బందితో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలని అన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

- ఆరోగ్య కేంద్రం తనిఖీలో కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలద్వారా మెరుగైనా వైద్య సేవలు అందిస్తుందని, ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, నస్పూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను సోమవారం కలెక్టర్ కుమార్ దీపక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వార్డులు, పరిసర ప్రాంతాలను పరిశీలించి అందుతున్న వైద్య సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది, వైద్యులు సమయ పాలన గురించి తెలుసుకుని వార్డులను సందర్శించి, హాజరు రిజిస్టర్, మందులనిల్వల రిజిస్టర్లను తనిఖీ చేశారు. వర్షకాలంలో వ్యాధుల నివారణకు జాగ్రత్తలు పాటించాలని, వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు సమయపాల న పాటించాలని, ఎల్లవేళల అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. అనంతరం సీసీసీలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని తనిఖీ చేశారు. తరగతి గదులు, వంటశాల, మూత్రశాలలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. మోను ప్రకారం పోషక విలువలగల ఆహారం అందించాలని, శుద్ధమైన మంచి నీటిని అందించాలన్నారు. వర్షాకాలంకావడం వలన పరిశుభ్రత పరిసరాల శుభ్రత ఎంతో అవసరమన్నారు. పదవతరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి వివిధ సబ్జెక్టులతో ప్రశ్నలు అడిగి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ మౌనిక వైద్య, విద్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

టైగర్‌జోన్‌లో ఆంక్షలు ఎత్తి వేయాలి

- నాయకుల రాస్తారోకో
- ఎఫ్‌డీవోకు వినతి

జన్నారం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం, నిర్మల్ జిల్లాలోని కడెం మండలాలకు భారీ వాహనాలకు అనుమతులు ఇవ్వాలని టైగర్ జోన్‌లోని ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అన్ని పార్టీల నాయకులు ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ఎఫ్‌డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సామాజిక కార్యకర్త భూమాచారి మాట్లాడుతూ భారీ వాహనాలకు అనుమతించకపోవడంతో పాటు ఆంక్షలు పెట్టడం వల్ల టైగర్‌జోన్‌లోని జన్నారం అభివృద్ధి కుంటుపడిందని, ఇక్కడి ప్రజలకు ఉపాధి కరువైందన్నారు. యువతకు ఉపాధితో పాటు అభివృద్ధి జరగాలంటే ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంధన్‌పల్లి గ్రామ ప్రజలతో పాటు మండల నాయకులు సిటిమల్ల భరత్ కుమార్, సిలువ జనార్ధన్, ఫజల్‌ఖాన్, కాసెట్టి లక్ష్మణ్, కమ్మల విజయధర్మ, శ్రీనివాస్‌గౌడ్, సూర్యం, సుతారి వినయ్, చందు, మున్వర్ అలీఖాన్‌లతో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.



ఎఫ్‌డీవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

భారీ వాహనాలకు అనుమతులు ఇవ్వాలి

- ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

జన్నారం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల టైగర్‌జోన్‌లో మంచిర్యాల జిల్లాలోని జన్నారం, నిర్మల్ జిల్లాలోని కడెం, ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ మీదుగా భారీ వాహనాలకు అనుమతులు ఇవ్వాలని వెడ్మబొజ్జు పటేల్ రాష్ట్ర అటవీశాఖ వైల్డ్‌లైఫ్ బోర్డు నిర్వహించిన సమావేశంలో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీలను అడవికి దూరం చేయడం సరి కాదన్నారు. మైసంపేట ఆదివాసీల పునరావాసంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే సమాచారం లేకుండా అభయారణ్యంలోని అడవి గ్రామాలను తరలించడం మంచిదికాదన్నారు. అటవీ హక్కు చట్టం ప్రకారం అడవిలో ఉండే ఆదివాసీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కవ్వాల్ టైగర్ జోన్‌లో బఫర్‌జోన్ ఏర్పాటు చేయడం వల్ల చేతి వృత్తుల ఆదివాసీల వారికి ఉపాధి కరువైందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం

- కమిషనరేట్ పరిధిలో 193 మందికి విముక్తి
- 18 కేసులు నమోదు

మంచిర్యాలక్రైం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ 11 విజయవంతమైనట్లు రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా తెలిపారు. కమిషనరేట్ పరిధిలో 193మందిని విముక్తిచేసి 18మందిపై కేసు నమోదు చేశామన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సంవత్సరానికి రెండు సార్లు ఆపరేషన్‌స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నా మన్నారు. తప్పిపోయిన, వదిలివేయబడిన వివిధరకాల బాల కార్మికులు కిరాణం షాపుల్లో మెకానిక్ షాపుల్లో హోటళ్లలో వివిధ కంపెనీల్లో పనిచేస్తూ లేదా రోడ్డుపై భిక్షాటన చేస్తున్న పిల్లలు బాల కార్మికులుగా ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగించామన్నారు. కొందరిని చిల్డ్రన్‌హోం పంపించామన్నారు. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బంది చైల్డ్ వెల్ఫేర్ కమిటీ లేబర్ డిపార్ట్‌మెంట్, విద్యాశాఖచైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్‌మెంట్, వైద్యశాఖ, వివిధశాఖల సమన్వయంతో ఈకార్యక్రమాన్ని విజయవంతం చేశామన్నారు. జులై 1 నుంచి 31వరకు ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని 190మందిలో బాలబాలికలను గుర్తించి బాలకార్మికులను విముక్తిచేసి పాఠశాలలో చేర్పించామన్నారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకోసం బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. బాలలను పనిలో పెట్టుకున్న ఎక్కడైన పని చేసిన లేదా తప్పి పోయిన వదిలివేయబడిన బాలల సమాచారం కోసం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి కాల్ చేయాలని లేదా 100కు కాల్ చేయాలని సూచించారు.

బాల కార్మికులను పెట్టుకున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ స్మైల్ విజయవంతం చేసినవారందరిని ఆయన అభినందించారు.



మాట్లాడుతున్న రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా